క్లుప్తంగా

రేపటి నుంచి ఆర్ట్ ఎగ్జిబిషన్

శ్రీనగర్‌కాలనీ: కొండాపూర్‌లోని శ్రీకోట్ల విజయభాస్కర్‌రెడ్డి బొటానికల్ గార్డెన్‌లో చిత్రకారిణి మౌలిక జొన్నల ఆర్ట్ ఎగ్జిబిషన్ పేరిట ఈ నెల 30 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్నట్లు చిత్రకారిణి మౌలిక తెలిపారు. చిత్రకళాభిమానులు ఆర్ట్ ఎగ్జిబిషన్ సందర్శించి మొక్కలపై గీసిన చిత్రాలను తిలకించాలని కోరారు.

నేటి నుంచి గుజరాత్ హస్తకళా ఉత్సవ్

శిల్పారామంలో అక్టోబర్ 8వ తేదీ వరకు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నేటి నుంచి ఇండస్ట్రియల్ ఎక్స్‌టెన్షన్ కాటేజ్ (ఇండెక్స్–సీ) గుజరాత్ ప్రభుత్వం 6వ గుజరాత్ హస్తకళా ఉత్సవ్‌ని ఏర్పాటు చేసింది. ఇది అక్టోబర్ 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు అందుబాటులో ఉంటుంది. గుజరాత్ సాంప్రదాయ నృత్యాలను ప్రదర్శించనున్నారు. ప్రతిరోజు సాయంత్రం ఆంఫీ థియేటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: అనారోగ్యంతో బాధపడుతున్న రోగుల కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. గురువారం రూ.9.21 లక్షల చెక్కుల పంపిణీ చేశారు. మియాపూర్, శేరిలింగంపల్లి, మాదాపూర్, కొండాపూర్, చందానగర్, గచ్చిబౌలి డివిజన్లకు చెందిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.

1న బాలబృందావనం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో బాలబృందావనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అక్టోబర్ 1వ తేదీన సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'గివింగ్ ఈజ్ ట్రూ రిసీవింగ్' అనే అంశంపై .. 9 నుంచి 14 ఏళ్ల చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 23001234లో సంప్రదించవచ్చు.

రేగులకుంట చెరువు సుందరీకరణ షురూ

మియాపూర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని చెరువులను సుందరీకరిస్తామని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్ కాలనీ, రేగులకుంట చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.కోటి 50 లక్షల వ్యయంతో చేపడుతున్న సుందరీకరణ, అభివృద్ధి పనులకు కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డితో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ

శేరిలింగంపల్లి: భెల్ ఎంఐజీ కాలనీలో త్రిశూల్ యూత్ అసోసియేషన్ గణేష్ మండపం వద్ద బీజేపీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులను గురువారం పంపిణీ చేశారు.

గంగమ్మ ఒడికి గణనాథులు

శోభాయమానంగా గణేశుల శోభాయాత్ర ● శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో ప్రశాంతంగా నిమజ్జనాలు



శేరిలింగంపల్లి జోన్ బృందం: 'జై గణేష్....జైజై గణేష్.. గణపతిబొప్పా మోరియా.. బై బై గణేష్' నినాదాలు మారుమోగాయి. గురువారం శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో గణేష్ నిమజ్జనాల సందర్భంగా వీధులన్నీ కోలాహలంగా మారాయి.

దుర్గంచెరువు, మల్కంచెరువు కాయిదమ్మకుంట, కొత్తకుంట, గురునాథంచెరువు, గంగారం, నల్లగండ్ల చెరువుల వద్ద నిమజ్జనాలు అధికార యంత్రాంగం పర్యవేక్షణతో సాఫీగా సాగాయి. కాగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కోనేర్ల నుంచి గణనాథుల విగ్రహాలు, పూజాసామగ్రిని వెంటనే తొలగించేలా ఏర్పాట్లు చేశారు.



గంగారం చెరువు వద్ద సిద్ధంగా ఉన్న క్రేన్లు





గుర్నాథం చెరువు వద్ద ..





గంగారం చెరువు వద్ద..





దుర్గంచెరువు వద్ద నిమజ్జనానికి గణనాథుడిని తీసుకొచ్చిన భక్తులు





మాదాపూర్ దుర్గంచెరువు వద్ద ..



గంగారం చెరువు వద్ద గణేషుడికి మొక్కుతున్న భక్తులు



తారానగర్‌లో గణేష్ శోభాయాత్ర



గంజాయి చాక్లెట్ల విక్రేతలు అరెస్ట్

హఫీజ్‌పేట్ : గంజాయి చాక్లెట్లను విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసిన సంఘటన శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్ తెలిపిన ప్రకారం వివరాలు...ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రశాంత్‌కుమార్ పరిదా (30), బిజయ్ కుమార్ గిరి (30)లు బతుకుదెరువు కోసం నగరంలోని మాదాపూర్ చందానాయక్ తండాకు వచ్చి పాన్ షాప్ నడుపుతున్నారు. పాన్ షాప్‌లో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్నట్లు గురువారం మధ్యాహ్నం శంషాబాద్ డీపీఈఓకు విశ్వసనీయ సమాచారం అందడంతో జిల్లా టాస్క్‌ఫోర్స్, శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ సంయుక్తంగా కలిసి పాన్‌షాప్‌పై



దాడులు నిర్వహించారు. గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు 7 కిలోల గంజాయి మిక్స్‌డ్ చాక్లెట్లు ఉన్న 39 పాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మియాపూర్: గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఈ నెల 26 ఉదయం మియాపూర్‌ని ఆర్‌బీఆర్ కాంప్లెక్స్ వద్ద ఓ వ్యక్తి పడి ఉన్నాడని స్థానికులు మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే మియాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా అతను అప్పటికే చనిపోయి ఉన్నాడని గుర్తించారు. చుట్టుపక్కల ఆరా తీయగా భిక్షాటన చేస్తూ బయట షాపుల ముందు పడుకుంటూ ఉండే వాడని తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషిచేద్దాం

మియాపూర్ : భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషిచేద్దామని ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ వనం సుధాకర్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ జయంతి సందర్భంగా మియాపూర్‌లోని ఎంఏనగర్ కార్యాలయంలో నిర్వహించిన జయంతికి ఆయన హాజరై నాయకులతో కలిసి భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డివై గ్రేటర్ హైదరాబాద్ నాయకులు శ్రీనివాసులు, మురళీ, మధుసూదన్, ఎండీ సుల్తానా, దశరథ్ నాయక్ పాల్గొన్నారు.

పటాన్‌చెరు టౌన్: యువతకు మార్గదర్శకుడు భగత్‌సింగ్ అని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడిల శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. గురువారం భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఇస్నాపూర్ చౌరస్తా లో 'తిరంగా యూత్ ఆఫ్ ఇండియా' వారి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భగత్‌సింగ్ చిత్రపటానికి బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు.

పోటాపోటీగా 'లడ్డూ' విక్రయాలు

శేరిలింగంపల్లిజోన్ బృందం: గణేశ్ లడ్డూల వేలం పోటాపోటీగా సాగింది. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్ పేట్, మాదాపూర్ డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలో ప్రతిష్టించిన వినాయకుడి విగ్రహాల లడ్డూల ధర లక్షల్లో పలికాయి. పలువురు వేలం పాటల్లో పోటీలు పడి మరీ దక్కించుకున్నారు.



తారానగర్‌లో.. రూ.4.30 లక్షలకు లడ్డూను దక్కించుకున్న సంజీవరెడ్డి



రాఘవేంద్రకాలనీ సీబ్లాక్ గణేష్ లడ్డూను రూ.4.95 లక్షలకు దక్కించుకున్న రమేష్



నల్లగండ్లలో .. రూ.1,90,000కు లడ్డూను సొంతం చేసుకున్న కరుణాకరరెడ్డి

కాలనీ పేరు	లడ్డూ కొనుగోలు చేసిన వారు	ధర
రాఘవేంద్ర కాలనీ సీ బ్లాక్ గణేష్ లడ్డూ	కె.రమేష్	రూ.4.95లక్షలు
తారానగర్ శ్రీ సిద్ధి వినాయక ఉత్సవ సమితి	పోరెడ్డి సంజీవరెడ్డి	రూ.4.30 లక్షలు
గోపన్‌పల్లి ఈదమ్మ–పోచమ్మ ఆలయ గణేష్ లడ్డూ	ముత్తంగుల వెంకటేష్	రూ.2.60 లక్షలు
తారానగర్ తుల్జాభవానీయూత్ అసోసియేషన్	బచ్చు సాయి శశాంక్	రూ.2.00 లక్షలు
తారానగర్ తుల్జాభవానీ యూత్ అసోసియేషన్	పాలఆంజనేయులు (చిన్నలడ్డూ)	రూ1.50 లక్షలు
శేరిలింగంపల్లి యూత్ అసోసియేషన్ పెద్ద లడ్డూ	బి.రాము	రూ.85 వేలు
ఆర్య కటిక సూర్య వంశీ యూత్ అసోసియేషన్ పెద్ద లడ్డూ	లగాన్ శ్రీనివాస్	రూ. 85 వేలు
శేరిలింగంపల్లి యూత్ అసోసియేషన్ చిన్న లడ్డూ	జ్యోతి	రూ.63 వేలు
ఆర్యకటిక సూర్యవంశీ యూత్ చిన్న లడ్డూ	బి. మహేష్	రూ.58వేలు
నానక్‌రాంగూడ భాగ్యలక్ష్మి ఆలయ గణేష్ లడ్డూ	కిరణ్‌గౌడ్	రూ.52వేలు



గచ్చిబౌలి డివిజన్‌లో.. కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, ఉత్సవ సమితి ప్రతినిధులు



మియాపూర్.. ఎర్త్ మూవర్స్ ఆధ్వర్యంలో..

ముగిసిన నవరాత్రి ఉత్సవాలు

శేరిలింగంపల్లి జోన్ బృందం: గణేశ్ నవరాత్రి ఉత్సవాల ముగింపు రోజు గురువారం గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధి కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి డివిజన్లు, చందానగర్ సర్కిల్ పరిధిలోని మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్, చందానగర్ డివిజన్లలోని కాలనీలు, బస్తీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో ప్రతిష్టించిన గణనాథుల మండపాల వద్ద పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు స్వామి వారిని దర్శించుకున్నారు. పలుచోట్ల అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. తదనంతరం స్వామి వార్లను నిమజ్జనానికి తరలించారు.



చందానగర్‌లో ..ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజులా రఘునాథ్‌రెడ్డి, ఉత్సవ సమితి ప్రతినిధులు



శేరిలింగంపల్లిలో .. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్ తదితరులు



వివేకానందనగర్ దీనబంధు కాలనీలో.. బీజేపీ నాయకులు డా.సరేష్, బాబు అనిల్‌రెడ్డి, శ్రీనాథ్, కృష్ణ, అజయ్ తదితరులు

సీపీఐ కార్యకర్త మామిడిపూడి రామారావు కన్నుమూత

హఫీజ్‌పేట్ : భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ కార్యకర్త మామిడిపూడి రామారావు (77) గురువారం కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లోని వృద్ధాశ్రమంలో కన్నుమూశారు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరావు ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి ఎర్ర జెండా కప్పి నివాళ్ళుర్పించారు. రామారావు మృతి పట్ల సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, అధ్యక్షులు, సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి రామకృష్ణ, సీపీఐ చిత్తూరు జిల్లా నాయకులు రాము నాయుడు, మురళి తదితర ప్రముఖులు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.



శ్రద్ధాంజలి ఘటించన వారిలో సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు, హెల్త్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కె.రజిని, వృద్ధాశ్రమ కమిటీ సభ్యులు డాక్టర్ సరస్వతి, రాజేంద్రరావు, మేనేజర్ శ్రీనివాస్, వృద్ధులు ఉన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225455
9912225462